క్లుప్తంగా

ఇళ్ల పట్టాల పంపిణీ

ఉంగుటూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతోందని ఎంపీపీ వడ్ల మూడి సరోజిని అన్నారు. పెదఅవుటపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న కాలనీ లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలను శనివారం అందజేశారు. సర్పంచ్ బాణావతు తిరుపతమ్మ, పార్టీ గ్రామ కన్వీనర్ సాంబశి వరావు, ఎంపీటీసీ విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అఖండ విజయం చేకూర్చాలి

గన్నవరంరూరల్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు(ఆర్ వీఆర్) పిలుపునిచ్చారు. శనివారం సూరంపల్లి గ్రామం 98వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రచారాన్ని గ్రామపార్టీ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సహకార బ్యాంకు అధ్యక్షుడు తుల్లిమిల్లి ఏడుకొండలు ఎగురవేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి జలసూత్రం రామ్మోహనరావు, నాయకులు పులపాక రమేష్, అజయ్, జగదీష్, బూక్యా కోటేశ్వరరావు, సర్నాల రాఘవేంద్రరావు, తోట నవీన్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి మండల డైరెక్టర్ పామర్తి మాధవరావు, పసుపులేటి ఏడుకొండలు సూరెడ్డి మణిమ్మ పాల్గొన్నారు.

రూరల్ మండలంలో ఫ్లాగ్ మార్చ్

రామవరప్పాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విజయవాడరూరల్ మండలం గూడవల్లి, నిడమానూరు గ్రామాల్లో శనివారం పటమట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఆదేశాల మేరకు డీసీపీ ఆదిరాజ్‌సింగ్ రాణా పర్యవేక్షణలో సెంట్రల్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ భాస్కర్‌రావు నేతృత్వంలో శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం కవాతును నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేమున్నామన్న భరోసా ప్రజలకు కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. పటమట సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు దుర్గాప్రసాద్, సతీష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 37 కేసుల పరిష్కారం



ఉయ్యూరు: లోక్ అదాలత్‌తో కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీహరి న్యాయస్థానం పరిధిలోని 37 కేసులను పరిష్కరించారు. 32 క్రిమినల్, 5 సివిల్ కేసులు పరిష్కరించారు. వివిధ కేసుల్లో కక్షిదారులకు రూ.8.55 లక్షలు పరిహారం మంజూరు చేస్తూ తీర్పునిచ్చారు. అదాలత్‌లో సభ్యులు డాక్టర్ తిరుమలరావు, నాగేశ్వరరావు, న్యాయవాదులు చంటిబాబు, మోర్ల అంక శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్ పాల్గొన్నారు.

సిబ్బందికి యూనిఫాం పంపిణీ



గన్నవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ చేతుల మీదుగా సిబ్బందికి యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సంస్థలో పనిచేసే ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సిబ్బందికి రెండు జతల చొప్పున యూనిఫాం అందజేసినట్లు తెలిపారు. స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి ఏ.కిషోర్, గ్రేడ్-2 కార్యదర్శి పి.జ్యోతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ఉయ్యూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరమ ని పలువురు ప్రజాప్రతినిధులు అ న్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ కార్యాలయంలో ఆ పార్టీ ఆర్యవైశ్య సంఘ నాయకుడు వెంట్రప్రగడ బాబ్జీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్ బాబు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు ఊర కిషోర్, ఊర నాగిన్, అబ్దుల్ రసూల్, ఎండీ ఈసా, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

మాయకూటమిని తరిమికొట్టేందుకు సిద్ధం

మంత్రి జోగి రమేష్



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: అనైతిక పొత్తులు పెట్టుకుని ఎన్నికలకు వస్తున్న మాయకూటమిని తరిమికొట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరు పట్టణంలో శనివారం ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారులను పలకరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు చేసిన మేలును వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ల సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండపల్లి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, మున్సిపల్ వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు గోన మదన్, గుంజా సుధాకర్, నాయకులు త్రిపురం జాలేశ్వరరావు, కొండపల్లి శివ, వేగిరాతి శ్రీను, వాసు, షరీఫ్, సైదా, అబ్దుల్ సద్దాం, బ్రహ్మం, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్ పాల్గొన్నారు. సుందరమ్మ పేటలో మంత్రి జోగి రమేష్‌కు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

కంకిపాడు: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, ఆటో కార్మికులు 150 మంది శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి జోగి రమేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి సాగే యుద్ధమన్నారు. కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. కంకిపాడు పట్టణంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన పక్షాలకు చెందిన కార్యకర్తలు జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా కంకిపాడులోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కంకిపాడు, గోసాల, ఈడుపుగల్లు, గంగూరు, పెనమలూరు, పోరంకి సెంటర్ల మీదుగా సాగింది. మంత్రి జోగి రమేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు రామసుధీర్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ మరియబాబు, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, చిట్టూరి కోటయ్యబాబు, మల్లెల వేణు, చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు, రాజులపాటి శివబ్రహ్మేశ్వరరావు, ఆర్ఎంపీ సుధాకర్, మల్లు, జె.నాగేశ్వరరావు, లాం సురేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి ఇంటింటి ప్రచారం

ఫ్యాన్ జోష్ పెరగటంతో పాటుగా పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థిగా మంత్రి జోగి రమేష్‌ను అధిష్టానం ఖరారు చేసింది. యనమలకుదురు గ్రామం వేదికగా ఆదివారం ప్రచారాన్ని ప్రారంభించి పార్టీకి విజయాన్ని చేకూర్చేందుకు 'సిద్ధం' అయ్యారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

పెనమలూరు: గ్రామాల అభివృద్ధి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ అన్నారు. యనమలకుదురు– పెదపులిపాక చిన్నకట్ట రోడ్డును రూ.35 లక్షలతో నిర్మాణం చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జగనన్నను తిరిగి గెలిపిస్తే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు గుమ్మడి విజయ్‌కుమార్, మరీదు శ్రీనివాసరావు, ఈడే గోపాలకృష్ణ, అమీర్‌ఖాన్,వేమూరి బాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వీరే

పెనమలూరు నియోజకవర్గం



జోగి రమేష్

పేరు : జోగి రమేష్

ప్రస్తుత హోదా : ఎమ్మెల్యే(పెడన), రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి

విద్యార్హత : బి.ఎస్సీ

తల్లిదండ్రులు : జోగి మోహన్ రావు, పుష్పవతి

కుటుంబ వివరాలు: శంకుతలదేవి(భార్య), రాజీవ్, రోహిత్‌కుమార్, రేష్మాప్రియాంక

రాజకీయ నేపథ్యం : విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉన్నారు. యూత్ కాంగ్రెస్ విభాగంలో కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా సేవలు అందించారు. రైల్వే బోర్డు సభ్యులుగా, శాతవాహన ఆర్టీసీ జోనల్‌చైర్మన్‌గా పని చేశారు. 2009లో వైఎస్సార్ సూచనలతో పెడన అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మైలవరం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2019లో తిరిగి వైఎస్సార్ సీపీ తరఫున పెడన అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2022 ఏప్రిల్ 11న సీఎం వైఎస్ జగన్ కేబినెట్‌లో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యకలాపాలు : ఇటీవలే పెనమలూరు నియోజకవర్గానికి వచ్చారు. అనతికాలంలోనే ప్రజలకు అత్యంత చేరువ అయ్యారు. నిత్యం ప్రజల్లో తిరుగుతూ, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు.

గన్నవరం నియోజకవర్గం



డాక్టర్ వల్లభనేని వంశీమోహన్

పేరు : డాక్టర్ వలభనేని వంశీమోహన్

ప్రస్తుత హోదా : తాజా మాజీ ఎమ్మెల్యే

విద్యార్హతలు : ఎంవీఎస్‌సీ (మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్సు)

కుటుంబ వివరాలు : పంకజ శ్రీ(సతీమణి), లక్ష్మీవసుంధర(కుమార్తె), వెంకటరవీంద్ర(కుమారుడు)

రాజకీయ నేపథ్యం : 2006లో గన్నవరం నియోజకవర్గంలో టీడీపీతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2009 విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి గన్నవరం శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 2019 ఎన్నికల అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.

చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : 2006లో ఆయన మాతృమూర్తి వల్లభనేని అరుణ పేరుతో చారిటబుల్ ట్రస్ట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక పరంగా వేలాది మంది పేదలకు ఆర్థిక తోడ్పాటును అందించారు. గత పదేళ్లుగా ఎమ్మెల్యేగా వంశీమోహన్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. గన్నవరం నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు విశేష కృషి చేశారు.

అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్



గన్నవరంలో విగ్రహానికి ముసుగులు వేస్తున్న పంచాయతీ సిబ్బంది

గన్నవరం: రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమలులోకి రావడంతో కార్యచరణ చేపట్టారు. మండల పరిధిలోని రహదారుల పక్కన ఉన్న రాజకీయ పార్టీల జెండాలను, బ్యానర్లు, ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నారు. ప్రధాన సెంటర్లతో పాటు గ్రామగ్రామాన రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ కేంద్రంగా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ ఎన్నికల కోడ్ అమలును పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు నిమిత్తం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కృషి

కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ పద్మావతి తదితరులు

రామవరప్పాడు: రాష్ట్రంలో సహకార వ్యవస్థను మరింతగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో ది రామవరప్పాడు విశాల సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని శనివారం పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో నిర్లక్ష్యానికి గురైన సహకార వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి బాటలో నడిపేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నారన్నారు. సొసైటీ బ్యాంకులకు నేడు నూతన భవనాలు, గోడౌన్ల నిర్మాణాలు జరిగాయన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ వారి ఉన్నతికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు రూ.11,300 కోట్ల టర్నోవర్‌తో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. రామవరప్పాడు సొసైటీ చైర్మన్ సాదం వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రూ.2.35 కోట్ల నిధులతో నాలుగు ఫ్లోర్లలో ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణ పనులు పూర్తికావడంతో సంఘ కార్యాలయ విధులు, కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఈ ప్రారంభోత్సవం చేశామన్నారు. బ్యాంకు కార్యాలయంతో పాటు లాకర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వర రావు, మల్లాది జగదీష్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెనమలూరు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ప్రశ్న పత్రాలను పెనమలూరు పీఎస్‌లో భద్రపరిచారు.

విజయవాడరూరల్: పదో తరగతి పరీక్షలకు రూరల్ మండలం నుంచి 2,668 మంది విద్యార్థులు హాజరవుతున్నారని మండల విద్యాశాఖాధికారి 2 ఎ.సూరిబాబు తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటల కల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

కంకిపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు కంకిపాడు మండలంలో తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. తరగతి గదుల్లోని టేబుల్స్‌పై రోల్ నంబర్లను రాయించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు.

రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

పెనమలూరు: పవిత్ర రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఇస్లాం మత గురువు షరీఫ్ అన్నారు. యనమలకుదురులో శనివారం శ్రీసత్యసాయి ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు ఇఫ్తార్ విందు సందర్భంగా ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలో అన్ని మతాలు సమానమని, అందరు సోదర భావంతో మెలగాలన్నారు. భట్టరాజు కార్పొరేషన్ చైర్‌పర్సన్ కూరపాటి గీతాంజలి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ముస్లిం మైనార్టీ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోటం రాజు, ఉపాధ్యాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారుతో సంబరాలు



గన్నవరంలో సంబరాలు జరుపుకుంటున్న పార్టీ నేతలు

పెనమలూరు: వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గం అభ్యర్థిగా జోగి రమేష్‌ను ఖరారు చేయటంతో గంగూరు పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లువిరిసింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. మంత్రి జోగి రమేష్‌తో పాటు పార్టీ నేతలు, కార్యకర్తలు జగనన్న ఫొటోలతో సందడి చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని తెలిపారు.

గన్నవరంలో సంబరాలు

గన్నవరం: వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ పేరును అధిష్టానం ప్రకటించడం పట్ల శనివారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద యువజన నాయకులు పెద్ద ఎత్తున్న బాణసంచా కాల్చడంతో పాటు స్వీట్లు పంచి పెట్టారు. వంశీమోహన్‌ను వరుసగా మూడో సారి గెలుపించుకుంటామని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జలసూత్రం రామ్మోహన్‌రావు, పార్టీ నేతలు మేచినేని బాబు, జేసీఎస్ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పోలిమెర పేతురు పాల్గొన్నారు.

ఘనంగా గోపాలకృష్ణస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో శ్రీగోపాలకృష్ణస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలో వంతెన డౌన్‌లో ఆలయాన్ని భక్తులు నిర్మించారు. గత మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 10.26 గంటలకు స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం 8.30 గంటలకు గోపూజ, విష్వక్సేన పూజ, యంత్రస్థాపన ,పలు పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శిఖరం, ధ్వజస్తంభం గురుత్మంత జయవాసనముల ప్రతిష్ఠ, పూర్ణాహుతి, స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాడిగడపలో వృద్ధుడి అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ -2లో మేకల సూర్యప్రకాశరావు(60) కుటుంబ సభ్యులతో నివశిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరు వ్యాపారం చేస్తాడు. ఈ నెల 13న సూర్యప్రకాశరావు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కుమారుడు శివరామకృష్ణ బంధువులు అతని కోసం ఆరా తీయగా, అప్పు కోసం యనమలకుదురు బ్రహ్మయ్య ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. ఆ తరువాత నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు కృష్ణరాజు, ప్రిన్సిపాల్ పద్మలత తదితరులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ కళాశాలలో 2017 నుంచి 2023 వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయంగా కలుసుకుని సందడి చేశారు. వివిధ కంపెనీల్లోని ఉద్యోగాల్లో స్థిరపడిన 100 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తొలుత కళాశాల మొత్తం కలియ తిరిగి విద్యార్థి ప్రాయంలో తాము చేసిన అల్లరిపనులు గుర్తు చేసుకున్నారు. తమ తమ తరగతి గదులకు వెళ్లి కొద్ది సేపు ముచ్చటించుకుని విద్యార్థులుగా మారిపోయారు. ఒకరినొకరు నిక్‌నేమ్‌లతో పిలుచుకుని ఆట పట్టించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించి సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లైలా న్యూట్రాస్యూటికల్స్ జనరల్ మేనేజర్ ఏవీ కృష్ణరాజు మాట్లాడుతూ.. కళాశాలలో విద్యా బుద్ధులు నేర్చిన పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమాజ అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సమాజ అవసరాలను గుర్తించి తదానుగుణంగా సేవా కార్యక్రమాలను నిర్వహించటమే లక్ష్యమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని శనివారం ఆయన దర్శించుకున్నారు. హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత లయన్స్ క్లబ్ హాల్‌ను సందర్శించారు. ఇటీవల రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన లయన్స్‌క్లబ్ హాల్‌ను పరిశీలించి, డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జిల్లా గవర్నర్ శంకర్ గుప్తా చేతుల మీదగా బహుమతులు పంపిణీ చేశారు. 2024–25 సంవత్సరానికి గానూ లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్‌కు నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శి చక్రధర్, కోశాధికారి రామకృష్ణ ప్రసాద్, రీజనల్ చైర్మన్ నందిగం స్వామి, రీజనల్ కార్యదర్శి అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి అక్కినేని రాఘవేంద్రరావు, కోశాధికారి క్లోపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



వీఎన్ పురంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి శనివారం శ్రీకారం చుట్టారు. ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.కోటితో రెండు కిలోమీటర్లు పొడవునా నిర్మిస్తున్న 18 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానిక శంకుస్థాపన చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ...కాలనీలోని రహదారులను అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు దక్కుతుందన్నారు. వార్డు సభ్యులు జలసూత్రం రాజు, గంటా థెరిస్సా, నాయకులు నిడమర్తి వినోద్, మాకుల విష్ణువర్ధనరావు, గద్దం అంకాలు, వడ్లమూడి రాజు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన

దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో రాజీవ్‌నగర్‌కు వెళ్లే రోడ్డుపై రూ.12 లక్షలతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను ఎంపీపీ అనగాని రవి భూమిపూజ చేసి ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచ్ బడుగు బాలమ్మ, నాయకులు గండికోట నాగరాజు, పైడేశ్వరరావు, కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

గన్నవరం: మహిళల సంక్షేమానికి, అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ చేయూత పథకం కింద నాల్గో విడతలో మండలంలోని 5,298 మందికి మంజూరైన రూ.9.93 కోట్లు చెక్కును అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ...ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అత్యధికంగా మహిళలకే లబ్ధి చేకూరుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ.. మహిళలందరూ మరోసారి వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. సర్పంచ్ బడుగు బాలమ్మ, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు దేవరపల్లి సుశీల, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఈడ్పుగంటి రంగారావు, ఏపీఎం మాధవి, ఈఓ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.